
# కారుకూతలు

## కె.కె. రఘునందన



**చి**దంబరానికి పరమ చిరాగ్గా వుంది. ఇంటా బయటా కూడా కారుకూతలు భరించలేకపోతున్నాడు. అర్ధాంగి భ్రమరం తోటి మరీ వేగలేక చస్తున్నాడు.

ఈ రోజుల్లో ప్రతి ఇంట్లో టి.విలు ప్రత్యక్షమైనట్లే ముందు ముందు కార్లు కూడా ప్రతి వాకిట్లో వుండటం ఖాయమని; జాతకాలు, వాస్తు అంటూ రెండు చేతులా సంపాదిస్తూ కారు కొనడానికి సందేహమెందుకని ఒత్తిడి చేసేది భ్రమరం.

ఓ వైపు మామగారు మార్తాండం వచ్చినప్పుడల్లా– ''ఏమోయ్ అల్లుడూ! మా ఊర్లో బోడిగుండురాజు కొన్న శాంత్రో కారు భలే మెరిసిపోతోందోయ్! నువ్వూ అలాంటిదోటి కొనేస్కుంటే అలా అరకు వ్యాలీకి, ఇలా భీమిలీ బీచ్‌కీ మా అమ్మాయిని షికార్లు తిప్పచ్చు. రేపు పిల్లా పీచూ పెరిగినా సరే కారయితే సరిగ్గా సరిపోతుంది. వెధవ స్కూటరు అమ్మిపారేయ్'' అంటూ నిప్పులో ఉప్పేసినట్లుగా మనస్సు చిటపటలాడించి వెళ్లిపోతాడు.

ఇక బయటి వాళ్ల సంగతి వేరే చెప్పనక్కరలేదు ఒకటే పీక్కుతింటున్నారు.

''ఈ రోజుల్లో కారు చౌకయిపోయిందండీ! మీలాంటి వాళ్లు మెయిన్‌టైన్

చెయ్యకపోతే మరెందుకు? అందువల్ల తప్పక కారు కొనేయండి – '' అని ఒకరు ఒత్తిడి చేస్తే ...

"మీరు ఆగమ పండితులు. చిదంబర సిద్ధాంతి గారంటే మాటలా? మీరలా పట్టుపంచెలో కారు దిగి వస్తుంటే మీ హోదా మరింత పెరిగిపోతుంది. ఇప్పుడు కారు కొనటమంటే నల్లేరు మీద బండి నడకే...'' అని హోదా గురించి పొగిడి మరీ పాడిచేవారు ఒకరు.

బాగా చనువున్న మిత్రులు చిదంబరం మీద పెద్ద ఎత్తున దాడికి దిగేవారు.

"నీకేం రా... వాడికీ వీడికీ జాతక చక్రాలూ, వాస్తులు, యంత్రాలు అంటూ కాకమ్మ కబుర్లు చెబుతూ నాలుగు డబ్బులు పోగేస్కుంటున్నావు... అలాంటి నువ్వు డొక్కు స్కూటరు మీద వెళ్లటం ముఖ్యంగా మాకు నామోషీగా వుంది. మా కోసమైనా ఓ కారు కొనుక్కోరా బాబూ!''

చిదంబరానికి తెగ చిరాకేసేది. తనేమీ బడా కాంట్రాక్టులు చేసిగానీ, ఆఫీసరులా అవినీతి చేసిగానీ సంపాయించలేదు. తన తాత ముత్తాతల విద్యే తనకు అబ్బి కాస్తో కూస్తో డబ్బు తెచ్చి పెడుతూంది. అది చూసి కన్ను కుట్టినట్టుగా, తను పోగు చేసుకున్న డబ్బునెలాగయినా గంగపాలు చేయడానికి కుట్ర పన్నినట్లుగా అనిపించసాగింది.

తనుగానీ కారు కొంటే దానికి పెట్రోలు పోయాలి. అసలే పెట్రో వడ్డన క్షణానికోసారి భగ్గుమంటోంది.

అదే మాట భ్రమరంతో అంటే... ''శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు ... మనకారుని గ్యాసుకిందికి కన్వర్టు చేసేస్కుంటే పెట్రోలు బాధుండదు. ... మహా అయితే నెలకి రెండు సిలెండర్లు ఖర్చు ఔతాయంతే... '' అని చిట్కాయణం విప్పింది.

ఈ విషయం గురించి చిదంబరం కూడా అక్కడా- ఇక్కడా భోగట్టా చేసాడు. కారుకి గ్యాసు తగిలించటం ఏమాత్రం క్షేమం కాదని, ఎక్కడో ఓ చోట చిన్నపాటి తేడా వచ్చినా ఢామ్మని పేలిపోవటం, ఆపై ప్రాణాలకే ఎసరొచ్చే ప్రమాదం వుందని, బతికుంటే బలుసాకయినా తినొచ్చుగానీ ఇలా కారుకి గ్యాస్ మాత్రం వద్దుగాక వద్దని చెప్పేసారు.

"గ్యాస్ భయంతో కారు కొనటం మానకు. నీకో చిట్కా.... నిన్నెలాగూ వాళ్లు వీళ్లు వాస్తు పేరుతో అద్దె కార్లు పట్టుకొచ్చి తీసుకెళుతున్నారు. అదే నీకు సొంత కారే వుందనుకో నీ కారు వేసుకుని వెళ్లు... పెట్రోలు వాళ్ల చేతనే పోయించు... ఇంటికి వచ్చేసినా ఆ మాత్రం ఈ మాత్రం పెట్రోలు మిగలక పోదు... దాంతో నువ్వు తిరుగు...'' అని బోడి సలహా ఒకటి పారేసాడు మార్తాండం.

మొత్తానికి చిదంబరం మీద కదిలిన కందిరీగల తుట్టె మాదిరిగా కారుకూతల దాడి మొదలైంది. అదే తలపోటుగా మారింది.

ప్రతి అడ్డగాడిదకీ సంజాయిషీ యిచ్చుకోక చస్తున్నాడు. ముఖ్యంగా భార్య భ్రమరం కారున్న వారితో ఈసులు పెట్టి చంపుతోంది. ఏ పేరంటానికో పెళ్లిళ్లకో వెళ్లినప్పుడో అమ్మలక్కల ముచ్చట్లలో ముఖ్యంగా – పట్టుచీరల ప్రసక్తి బలహీన పడి కారు చర్చ జోరుగాసాగుతోందని చెప్పి మరీ సాదపెడుతోంది.

కారులో జోరుగా షికార్లు కొడదామన్న భ్రమరం కోరిక కారు మబ్బులా ఆమె హృదయమంతా కమ్మేసింది.

అయినా తను కొనేది లేదని తెగేసి చెప్పేసాడు చిదంబరం. దాంతో తెగ ఏడుపులూ, పెడబొబ్బలు పెట్టేసి నగలు నాణ్యాలు తను అడగలేదని కేవలం రెండక్షరాలున్న కారు గురించి ఇంతలా అడుగుతున్నానని చెప్పింది భ్రమరం.

భర్తలో చలనం లేకపోవడంతో మాట్లాడటం మానేసింది. ఉప్పు కారాలు తక్కువ చేసి వండి తన నిరసనను తెలియచేసింది.

సరిగ్గా ఆ సమయంలోనే ఫైనాన్స్ కంపెనీలు చిదంబరం గుమ్మం తొక్కటం మొదలెట్టాయి.

"అయ్యా! మేం చాలా సింపుల్ ఇంట్రస్ట్‌కి కారు లోన్స్ ఇస్తున్నాం. డౌన్ పేమెంట్ కేవలం ఐదు వేలే....'' అని ఒకరు,

"ఎక్స్ఛేంజ్ మేళాలో మీ స్కూటర్ ఇచ్చేసి జీరో పర్సెంట్ వడ్డీకి కారు పట్టుకు పోండి. నెలవారీ మూడువేలు కడితే చాలు. ఇంత సదుపాయం మేం కల్పిస్తున్నా కారు కొనటానికి జంకటం చాలా ఘోరం సార్'' తమ ఫైనాన్స్ ప్లాన్స్ అన్నీ వివరించాక అన్నాడో ఏజెంట్.

''నీకేం రా... వాడికీ వీడికీ జాతక చక్రాలూ, వాస్తులు, యంత్రాలు అంటూ కాకమ్మ కబుర్లు చెబుతూ నాలుగు డబ్బులు పోగేస్కుంటున్నావు... అలాంటి నువ్వు డొక్కు స్కూటరు మీద వెళ్లటం ముఖ్యంగా మాకు నామోషీగా వుంది. మా కోసమైనా ఓ కారు కొనుక్కోరా బాబూ!''

"ఇప్పుడు ఏ ఇల్లు చూడండి... కారుకోసం ఓ పోర్టికో కూడా కట్టుకుంటున్నారు.... అంటే ముందు ముందు కారుకొనే ఆలోచన వున్నట్లే కదా... కాబట్టి కారు కామన్ అయిపోయింది సార్!'' అని నచ్చజెప్పేవారు మరి కొందరు.

ఇవన్నీ భ్రమరం చెవినబడ్డాయి. భర్తకి బాగా తలకెక్కి వుంటుందనుకొన్నది.

కొత్తకారు కొనటమంటే కొరివితో తల గోక్కోవటమేనని, సెకండ్ హ్యాండ్‌లో అయితే కారు చౌకగా దొరుకుతాయని, కాస్త మదుపుగానీ పెడితే కొత్తకారల్లే తళతళలాడి పోతుందని చెప్పి చిదంబరానికి నూరిపోశాడు ఎదురింటి వైకుంఠమూర్తి.

ఈ సలహా మాత్రం చిదంబరానికి బాగా నచ్చేసింది.

కొత్తకారు కొని అప్పులపాలయ్యే బదులు సెకండ్ హ్యాండ్‌ది కొనేసి కాస్త బాగు చేయించుకుంటే సరిపోతుందని తలపోశాడు.

ఈ సంగతి ముందే చెబితే ససేమిరా కాదంటుందని భ్రమరంకి తెలీకుండానే సెకండ్ హ్యాండ్ కార్ల షాపుకి వెళ్లాడు.

చిదంబరం లాంటి బాపతులు చాలా మందే వున్నారక్కడ. ఎన్నోరకాల కార్లు... రంగు రంగుల కార్లు .... చూసేసరికి చిదంబరానికి చిన్నమోజు పుట్టకపోలేదు.

నిల్చున్న పాటుగా ఏదో ఓ కారు కొనేసి పట్టుకు వెళ్లాలనుకున్నాడు చిదంబరం.

షాపు ఓనరు చిదంబరాన్ని చాలా కుషామత్తు చేసి స్కూటర్ తీసుకుని ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద ఓ అరవై వేలు కడితే సరిపోతుందని చెప్పాడు. దగ్గర్లోని ఓ మెకానిక్‌ను తీసుకొచ్చి చూపించాడు. వాడు కారు చుట్టూ ప్రదక్షిణాలు చేసిన మీదట భేషుగ్గా వుందని సర్టిఫై చేసి చిదంబరాన్ని ఓసారి కారులోపల కూర్చోబెట్టాడు. కుషన్ చాలా మెత్తగా, హాయినిచ్చేసరికి చిదంబరం ఐసైపోయాడు.

డబ్బులిచ్చేసాక సంతకాల వ్యవహారమంతా జరిపించేసి ఓ డ్రైవర్ని చిదంబరం వెంట పంపాడు ఓనర్.

కారు కదిలిన ఓ ఫర్లాంగు దూరంలో ఆంబోతు అరచినట్లుగా శబ్దం చేస్తూ ఆగింది.

"ఏమైంది?'' సైలెన్సర్ మార్చుకోవాలి సార్!'' అని నవ్వాడు డ్రైవర్.

అలా రెండు మూడు చోట్ల ఆగిన పిదప – ''ఇంజన్ ట్రబుల్ సార్'' అన్నాడు.

బుర్రపీక్కోవాలనిపించింది. శుభమాని కారు కొంటే ఈ ట్రబుల్సేమిటి?'' అనుకున్నాడు చిదంబరం.

"ఈ ట్రబుల్స్ అన్నీ వుండకూడదనుకొంటే ఓ ఇరవై దాకా పెట్టుబడి పెట్టాలి'' అని స్టార్ట్ చేసి పోనిచ్చాడు డ్రైవర్.

ఇంటి ముందాగిన కారును- అందులోంచి దిగిన భర్తను నమ్మలేకపోయింది భ్రమరం.

"ఏమండీ మీరూ!'' అంది తెగ ఆశ్చర్యపడిపోతూ.

"ఔను నేనే... మనకారే...'' నవ్వలేక నవ్వి అన్నాడు.

లోపలికెళ్లి పసుపు కుంకుమ తెచ్చి నాలుగు వైపులా పూసింది.

"ఏమండీ కారు మీద అలా వెళ్లొద్దామండీ! అంది తహతహగా.

ఆ వెంటనే కారు రోడ్డువైపుకు మళ్లింది.

"సార్! మీరు ఒకే అంటే నే ... చూస్కుంటా....'' అని అడిగాడు డ్రైవర్.

చిదంబరానికి అర్థం అయిపోయింది... పైసలో అన్నట్టు చేతులతో సంజ్ఞ చేశాడు వాడు. వెంటనే లోనికి వెళ్లి ఐదువేలు తెచ్చి చేతిలో పెట్టాడు.

అంతే పెద్ద రొదతో కారును లాక్కెళ్లాడు డ్రైవర్.

"అదేంటండీ... వాడలా...!! తెగ కంగారెత్తిపోయింది భ్రమరం.

"అదంతే .... ట్రబుల్స్ క్లియర్ అయ్యాకనే ఇంటికి తెస్తాడు'' అని లోనికి వెళ్లిపోయాడు చిదంబరం.

ఆమె ఉత్సాహమంతా నీరుకారిపోయింది.

అయితే చిదంబరం కారు కొన్న సంగతి ఆ కాలనీ అంతా పాకిపోయింది. దాంతో చిదంబరం ఇంటికి రాకపోకలు ఎక్కువైపోయాయి.

"గోవిందపురంలో ముక్తి ధామ్ బాగుంటుందిట... వెళదాం...'' అని ఒకరు.

"ఎస్. కోట దగ్గర పుణ్యగిరి వెళదాం... పిక్నిక్ వేసుకుంటే బాగుంటుంది....''

"రామతీర్థం వెళ్లి బోడికొండ ఎక్కుదాం...''

ఇలా రకరకాల ప్రోగ్రామ్‌లు తయారు చేసారు.

మరో రోజు డ్రైవర్ వచ్చి మెకానిక్‌కి బక్షీస్ కింద మరి ఐదు వేలు అదనంగా ఇవ్వాలని అడిగి పట్టుకుపోయాడు.

ఆ సమయంలోనే చిదంబరం డ్రైవింగ్ నేర్చుకున్నాడు. రివర్స్‌గేర్‌లో తడబడేవాడు. ఒక్కొక్కప్పుడు పెద్ద చప్పుడుతో ఆగిపోయేది. పొగకు అంతు పొంతు వుండేది కాదు. వీధి వీధంతా వ్యాపించేది. మధ్యమధ్యలో ఆగిపోతుండేది.

కారు తీయడమంటే ఓ గండంలాగే అనిపించేది చిదంబరానికి. అది చూసి – ''అందరికీ ముహూర్తాలు పెట్టే మీరు ... కారు కొన్నప్పుడు గాని నడపటానికి గాని ముహూర్తం చూస్కున్నారా! లేదే!!

పైడితల్లమ్మ వారి గుడికి గానీ రామతీర్థం గుడికి గానీ బండి తీసుకెళ్లి కొబ్బరికాయ కొట్టి, నిమ్మకాయలు ముట్టించారా.?? లేదు. అందుకే మీకు ఈ ట్రబుల్స్.. నల్గురి దిష్టి తగిలి శని పట్టుకుంది'' అని ఎడాపెడా వాయించింది భ్రమరం.

అది వినటంతోనే పిల్లి తన పిల్లల్ని ఏడిళ్లు తిప్పిన చందంగా నాలుగు గుడులకూ కారును తిప్పాడు.

ఇంతా కారు కొని వీధిలో నలుగురికీ భూత శాంతి చేయకపోతే నానా కూతలూ కూస్తారని చెప్పి రెండు స్వీట్లు ఓ హాట్‌తో చిరువిందు చేశాడు చిదంబరం.

''కారు కొని భారీగా పార్టీ ఇవ్వాలిగానీ... ఇదా'' అని పెదవి విరిచారంతా.

ఇన్ని ఆర్భాటాలు చేసిన మీదట అర్థాంగి భ్రమరాన్ని కార్లో ఎక్కించుకుని బయలుదేరాడు.

మిట్టమధ్యాహ్నం వేళ గుర్రం సకిలించినట్టుగా కారు శబ్దం చేయటంతో ... అపార్టుమెంట్లో వాళ్లంతా బయటకొచ్చి గుర్రుగా చూశారు.

ఏ కళనుందో గాని ఎట్టకేలకు కారు కదిలింది. సినిమా చూసి తిరిగి వస్తున్నప్పుడు మాత్రం పసిపిల్లాడి మనస్తత్వం పుణికి పుచ్చుకున్నట్లుగా తెగ అల్లరి పెట్టసాగింది కారు.

భ్రమరానికి ముచ్చెమటలు పట్టేసాయి.

''వెధవ కారు... ఛీ!'' అంది తెగ తిట్టుకుంటూ..... పరుగు తీయాల్సిన కారు... పరువు తీస్తున్నందుకు చిదంబరం కూడా డీలా పడిపోయి మెకానిక్‌ని కేకేసాడు. వాడొచ్చి ఇంజన్ వేడెక్కి పాడయిందంటూ రిపేర్ చేయడానికి పట్టుకుపోయాడు.

భ్రమరాన్ని రిక్షా ఎక్కించి పంపేశాడు చిదంబరం!!

కారు రిపేర్ పూర్తయి తిరిగి ఇల్లు చేరేసరికి రాత్రి పదయిపోయింది. చేతి చమురు వేయిదాకా వదిలింది.

ఈలోగా చిదంబరం కోసం ముహూర్తాలు... వాస్తులు అంటూ వచ్చిన వారంతా విసుక్కుంటూ వెళ్లిపోయారని చెప్పి గోలపెట్టింది భ్రమరం.

అప్పటికీ గుమ్మంలో కూర్చున్న ఓ వ్యక్తి చిదంబరాన్ని పలకరించాడు.

ఎగాదిగా చూశాడు చిదంబరం.

''నేన్రా ఆశీర్వాదాన్ని...!! అన్నాడు.

తరువాత కారు చుట్టూ తిరుగుతూ నవ్వసాగాడు ఆశీర్వాదం.

''ఏమైందిరా నీకు...?'' అని చిదంబరం అడుగుతున్నా ఇంకా నవ్వాపలేదు.

''ఒరే ...... ఈ కారు... కొన్నావా... హ్హహ్హహ్హ... '' విషయం చెప్పకుండా నవ్వుతుంటే భ్రమరానిక్కూడా చిర్రెత్తుకొచ్చింది.

''అదేంటి నీకు పిచ్చెత్తిందా...?'' కోపంగా అడిగాడు చిదంబరం.

''ఇది... ఇది .. నా కారు...'' మరల పకపకమన్నాడు ఆశీర్వాదం.

''అదేంటండీ మన కారును పట్టుకుని తన కారంటాండేంటి'' చిటపటలాడిపోయింది భ్రమరం.

''నీకేమైనా మతిపోయిందా...?'' చిర్రుబుర్రులాడాడు చిదంబరం.

''ఈ కారు నా కారే ... ఒకప్పుడు ... ప్రస్తుతం నీ కారు'' మరల అదే నవ్వు నవ్వాడు ఆశీర్వాదం.

''అంటే'' కళ్లింతవి చేసుకుని అడిగారిద్దరూ.

''ఔనౌను.... ఈ కారుతో పడలేకనే షెడ్డుకి అమ్మేసా... దీన్ని భరించటమంటే ఏనుగును మేపినట్టే .... ఇంతకీ నువ్వు దీన్ని ఎంతకు కొన్నావు? అడిగాడు ఆశీర్వాదం.

మొత్తం కొనుబడి, ఖర్చువెచ్చాలు చెప్పేసరికి మరింతగా నవ్వాడు ఆశీర్వాదం.

''ఒరే! నేను దీన్ని మెకానిక్‌కి పాతిక్కిచ్చేసా.... నీకైతే ఇరవైకి అమ్మిపారేసేవాడ్ని.. నీకేమో రిపేర్లన్నిటితో కలిపి లక్షదాటిందంటున్నావు...'' ఆశీర్వాదం మాటలకి నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది చిదంబరానికి.

ఈ కారు దోపిడిలో తనెంత కోల్పోయిందీ అర్ధమైంది.

నిజానికి ఈ కారు కొన్నది మొదలు మనశ్శాంతి కరువైంది. చేయించే రిపేర్లకిగానీ... పోసే పెట్రోలుకిగానీ అజ పజ లేకుండా పోయింది. పైగా కారు చేసే వింత చప్పుళ్లకి చుట్టుపక్కల జనం న్యూసెన్స్ కేసు పెడతామంటూ ఒకటే హెచ్చరించసాగారు.

ఈ రసాభాసను తట్టుకోలేకపోతున్నాడు చిదంబరం.

ఇది జరిగిన కొన్నాళ్లకు పుట్టింటికెళ్లింది భ్రమరం. తిరిగి వచ్చేసరికి పాతకారు స్థానంలో కొత్తకారుండటం చూసి తెగ ముచ్చట పడిపోయింది.

''చాలా బాగుందండీ.... ఆ వెధవ కారుతో పడలేక పోయాం... సాహసించి కొత్తది కొన్నారు ... '' అందా కారును ఆప్యాయంగా తడిమి.

''అదిగో అటు చూడు...'' అని పెరటివైపు చూపించాడు చిదంబరం.

''భలే భలే.. కొత్తకారు ఎండా వానలకి పాడయిపోకుండా షెడ్డుకూడా కట్టించారే...!! నా మనసు తెలిసి ప్రవర్తిస్తున్నారు'' మెచ్చుకోలుగా అంది భ్రమరం.

''నీ మనసు కాదు... ఇతరుల మనసు తెలిసి ప్రవర్తించాను. నీ కళ్లకు జిగేల్మన్న కారు పాతదే... కాని రంగేయించాను''

''ఆఁ!!''

''షెడ్డు కట్టించింది కారును రక్షించడానికి కాదు... నన్ను రక్షించుకోవడానికి''

''ఆఁ''

''ఔను! మనం వీధిలోకి వెళ్లే ముందర కారును షెడ్లో పెట్టించడానికి...''

''ఎందుకూ...'' కళ్లింతవి చేసుకుని చిత్రంగా అడిగింది భ్రమరం.

''బయటున్న కారును చూసి పంతులుగారు ఎటూ వెళ్లలేదు ఇంట్లోనో వున్నారనుకుంటారు. కారే కనిపించలేదనుకో ఎటో బయటకు వెళ్లారనుకోవడం సహజం. ఎందుకీ ఏర్పాటు అనంటే చెబుతున్నా... మీ హుందాకి కారు తప్పకుండా వుండాలి అంటూ కారు కొనేదాకా తినేసారు. కొత్తకారు కొనే స్థోమత ప్రస్తుతం లేక పాతకారుతోనే తిప్పలు పడుతున్నాను. ఆ విషయం నీకు తెలుసు. పోనీ ఈ కారుతో తంటాలెందుకు అమ్మిపారేద్దామని చూసినా మళ్లా కొన్నకారుని అమ్మేస్తారా అనో, తిరిగి కారు కొనమంటూనో, వేధించుకుతింటారీ జనం.... ఆ కారు కూతలు పడే కన్నా ''పంతులు గారికి కారుంది' అని జనం అనుకుంటే చాలు. అందుకనే ఈ ప్లానేసా.. ఒక వేళ తప్పిచెడి కారులేకుండా కనిపించామే అనుకో సింపుల్‌గా కారు గ్యారేజీకి వెళ్లింది అని చెప్పి తప్పించుకుంటాం...'' అన్నాడు నవ్వుతూ.

తను శ్రీవారితో కలిసి కారులో ఎంచక్కా షికార్లు కొట్టచ్చునన్న వెర్రి కోరికతో వున్న భ్రమరంకి కారున్నా లేనట్లేనన్న నిజం తలకెక్కేసరికి ఒక్కసారి నీరసం ముంచుకొచ్చి కళ్లు బైర్లుకమ్మాయి. ■

